
సాక్షి
గుంటూరు
గురువారం । 19 । జూన్ । 2025





## అయ్యప్పకు విశేష పూజలు

ఫిరంగిపురం: అమీనాబాద్ గ్రామం మూలాంకురేశ్వరి అమ్మ వారి కొండపై కొలువైన హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు.



## ఈవీఎం గోడౌన్ తనిఖీ

బాపట్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జె.వెంకట మురళి బుధవారం త్రైమాసిక సాధారణ పరిశీలనలో భాగంగా తనిఖీ చేశారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 514.10 అడుగుల వద్ద ఉంది. ఇది 138.7364 టీఎంసీలకు సమానం.

## న్యూస్‌రీల్

### ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలను ఆదుకోవాలి



చిలకలూరిపేట: ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని నాదెండ్ల, తుబాడు గ్రామాల్లో ఇరువురు రైతులు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. ఈ ఘటనకు నిరసనగా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఇతర ప్రజా సంఘాలతో కూడిన రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకుడు పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ, లోక్‌సత్తా, జనక్రాంతి తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### పొగాకు రైతుల ఆత్మహత్యలు ఆందోళనకరం

నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా



నాదెండ్ల: నల్లబర్లీ పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతుందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పొగాకు కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని నల్లమడ రైతు సంఘ నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు చెప్పారు. పల్నాడు జిల్లా నాదెండ్ల, తూబాడు గ్రామాల్లో ఆత్మహత్యకు పాల్పడిన ఇరువురు పొగాకు రైతులకు బుధవారం ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలు తీవ్ర విషాదకరమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కంపెనీలతో మాట్లాడి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### నేటి నుంచి బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలు

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు




నరసరావుపేట: బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోళ్లు గురువారం నుంచి జిల్లాలో పునఃప్రారంభించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలుపై సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు ధరలు తగ్గిన భయంతో ఆందోళన చెందుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలు చేయడానికి సీఎం యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటివరకు ఈ-క్రాప్, ఏపీ ఏఎంఎస్‌లో నమోదైన రైతుల వివరాలను సీఎం యాప్‌కు అనుసంధానించాలన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా 25 మిలియన్ కిలోల పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సీఎం యాప్‌లో నమోదు చేసిన రైతుల నుంచి మాత్రమే పొగాకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. డీఆర్‌ఓ ఏకా మురళి, డీఏఓ ఐ.మురళి, మార్క్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

### రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వాలే కారణం



ప్రత్తిపాడు: పొగాకు రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వాలే కారణమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ ఆరోపించారు. పల్నాడు జిల్లాలో పొగాకు రైతుల ఆత్మహత్యలకు నిరసనగా ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ ఆదాయం వస్తున్నప్పటికీ పొగాకు రైతులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే ఆరుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లబర్లీ పొగాకును క్వింటా రూ.12 వేలకు తగ్గకుండా కొనాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, రత్తయ్య, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



తమ అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు అక్కచెల్లెమ్మల ఉత్సాహం



చిన్నారితో కరచాలనం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్ జగన్‌ను చూసేందుకు పెంకుటిల్లు ఎక్కిన అభిమానులు

# జన సునామీ

## గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వైఎస్ జగన్ పర్యటనకు అనూహ్య స్పందన

- కూటమి ప్రభుత్వ బాధితులకు మద్దతుగా పౌరుషం చూపిన పల్నాడు
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ జగన్ వెంట నడిచిన ప్రజలు
- రోడ్లపై అడ్డంకులు సృష్టిస్తే పొలాల్లోనుంచి కాలినడకన, ద్విచక్ర వాహనాలపై స్వచ్ఛందంగా రాక
- కూటమి ఏడాది పాలనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు
- మా నమ్మకం నువ్వే జగన్ అంటూ చాటిన వైనం
- జయహో జగన్ అంటూ మారుమోగిన సత్తెనపల్లి



పల్నాడు జిల్లా రెంటపాళ్లలో జనసందోహానికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**అరచేతిని అడ్డుపెట్టి అఖండ సూర్యుడి తేజస్సు అడ్డుకోలేనట్లు.. సంక్షేమ సూరీడు.. జన హృదయ నేతను చూసేందుకు వచ్చిన జనతరంగాన్ని ఆంక్షల వలయాలు అడ్డుకోలేకపోయాయి.. ఉవ్వెత్తున ఎగిసిన అభిమాన సంద్రం ముందు నిర్బంధ చట్రాలు చిన్నబోయాయి.. బారులు తీరిన అభిమానం ముందు బారికేడ్లు దూదిపింజలయ్యాయి. ఏమా జనం.. ఏమిటా ప్రభంజనం.. ఇసుకేస్తే రాలనట్లు.. నేల ఈనిందా అన్నట్లు వైఎస్ జగన్ కాన్వాయ్ అడుగు పెట్టిన ప్రతి ఊరు జనహోరుతో నిండగా.. ప్రతి సర్కిల్ అభిమాన సంద్రమైంది. తమ అభిమాన నేతను చూసిన ఆనందం.. ఏడాదిగా తాము పడుతున్న కష్టాలు, కన్నీళ్లు గుర్తుకు వచ్చిన భావోద్వేగం.. ఏకమై దిక్కులు పిక్కటిల్లేలా.. కూటమి కుర్చీలు కదిలేలా.. జగన్నినాదమై వినిపించింది.**

సత్తెనపల్లి: కూటమి నేతల దాడులు.. పోలీసుల వేధింపులు కారణంగా మనస్తాపం చెంది మృతి చెందిన కుటుంబానికి భరోసా కల్పించేందుకు తమ అభిమాన నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ మధ్యకు వస్తున్నారని తెలుసుకున్న అభిమానులు తండోపతండాలుగా, స్వచ్ఛందంగా రెంటపాళ్లకు కదిలివచ్చారు. రెండు రోజులుగా వైఎస్ జగన్ పర్యటనకు అనుమతులు లేవంటూ పోలీసులు ఇబ్బందులకు గురి చేయడం, మరోవైపు పర్యటనను అడ్డుకుంటామంటూ అధికార పార్టీ నేతలు బరి తెగించి ప్రకటనలు చేయడం, ఇంకో వైపు పోలీసులు ఎక్కడికక్కడ అభిమానులను అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ అవేమీ లెక్క చేయకుండా ప్రజలు సత్తెనపల్లి చేరుకున్నారు.

### అన్నిదారులూ రెంటపాళ్లకే..




బస్సు పైకెక్కి అభిమానం చాటుకుంటున్న యువకులు

షెడ్యూలు ప్రకారం ఉదయం 11 గంటలకు సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చేరుకోవలసిన జగన్‌మోహన్‌రెడ్డి అభిమాన హోరు దాటికి సాయంత్రం 4:40 గంటలకు గ్రామానికి చేరుకున్నారు. కూటమి నేతల దాడులు, పోలీసుల వేధింపులతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న రెంటపాళ్ల గ్రామ ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్కడే పార్టీ జెండాను ఎగురవేశారు. మృతుడి తండ్రి కొర్లకుంట వెంకటేశ్వర్లును ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అన్నా అధైర్య పడవద్దంటూ ధైర్యం నూరిపోసి అండగా ఉంటానని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, దాడులు, అక్రమ కేసులు, వైఎస్సార్ సీపీలో ఉన్న కమ్మ సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకొని బనాయిస్తున్న కేసులు, దాడులపై నిలదీశారు. అనంతరం సాయంత్రం 5:32 గంటలకు తిరిగి రోడ్డు మార్గాన తాడేపల్లి బయలుదేరారు.

### ప్రారంభమైన వేధింపుల పర్వం



మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలో రెంటపాళ్ల చుట్టూ పోలీసులు బారికేడ్లు పెట్టి ప్రధాన రహదారిలో సైతం రాకపోకలను పూర్తిస్థాయిలో అడ్డుకున్నారు. ద్విచక్ర వాహనాలపై వచ్చేవారిని సైతం ఆధార్ కార్డులు చూపాలంటూ ఆంక్షలు విధించడమే కాక అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టారు. ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించిన వారిని వేధించడం ప్రారంభించారు. దీనిలో భాగంగా క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన గొర్రెపాటి జాన్, అచ్చంపేటకు చెందిన బాల సైదాలను సత్తెనపల్లి రూరల్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎవరెవరైతే బారికేడ్ల వద్ద తాము వెళ్లాలంటూ గట్టిగా చెప్పారో వారిని గుర్తించి వేధించేందుకు పోలీసులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు నోటీసులు సైతం ఇచ్చారు. ప్రస్తుతం ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

### సింగయ్య కుటుంబానికి పరామర్శ

గుంటూరు రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంలో ఏటుకూరు బైపాస్ రోడ్డు వద్ద ప్రైవేటు వాహనం ఢీకొని తీవ్రగాయాలపాలై మృతిచెందిన వెంగళాయపాలెం గ్రామానికి చెందిన చీలి సింగయ్య (53) మృతదేహాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్‌లు సందర్శించి ఘన నివాళులర్పించారు. వెంగళాయపాలెం గ్రామంలోని మృతుని నివాసానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి, ఆర్థికంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ తరఫున బాధితుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. సింగయ్య కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అంబటి రాంబాబు, బలసాని

### పర్యటన సాగిందిలా..

- పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంటిపూడి, నందిగామ అడ్డరోడ్డు, రామకృష్ణాపురం నుంచి పట్టణంలోకి రోడ్డు మార్గాన వైఎస్ జగన్ ప్రయాణించారు.
- ఆటోనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ గజ్జల వైద్యశాలలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ ప్రజలకు అభివాదం చేశారు.
- అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్, తాలూకా సెంటర్, గడియార స్తంభం సెంటర్, ఐదులాంతర్ల సెంటర్ మీదుగా అచ్చంపేట రోడ్ లోని రైల్వే గేట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వైఎస్ జగన్ కాన్వాయ్‌ని ముందుకు వెళ్లనిచ్చి వెంట ఉన్న నాయకుల వాహనాలు, ద్విచక్ర వాహనాలను పోలీసులు అనుమతించకపోవడంతో పార్టీ నేతలు 'డౌన్ డౌన్ పోలీసులు' అంటూ నినదించారు.
- అక్కడి నుంచి అంబేడ్కర్ నగర్, గండ్లురు అడ్డరోడ్డు, పాకాల పాడు మీదుగా రెంటపాళ్లకు చేరుకున్నారు. అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా భారీ పొక్లెయిన్లతో గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఎవరికి వారు జై జగన్ .. జై జై జగన్ అంటూ నినదించారు. పెద్ద ఎత్తున ప్రజలు ఘనస్వాగతం పలకడంతో వైఎస్ జగన్ చిరునవ్వుతో అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.

### డ్రోన్లు.. బారికేడ్లు



రెంటపాళ్లలో పోలీసులు ఎగురవేసిన డ్రోన్‌లు



రెంటపాళ్లలో జనం రాకుండా అడ్డుగా పెట్టిన బారికేడ్లు

- రెంటపాళ్లలో ఇళ్ల ముంగిట అడ్డంగా బారికేడ్లు
- వైఎస్ జగన్ కాన్వాయ్ వద్ద ఏకంగా నాలుగు డ్రోన్లు ఎగరేసిన పోలీసులు

సత్తెనపల్లి: కూటమి నేతల దాడులు, పోలీసుల వేధింపుల కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్న కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల వచ్చారు. జగన్ రాకను తెలుసుకున్న పోలీసులు రెంటపాళ్ల వీధుల్లో బారికేడ్లు అడ్డుగా పెట్టి జనాన్ని రాకుండా అడ్డుకున్నారు. ఇళ్లపై ఒక కానిస్టేబుల్, వీఆర్ఏలను ఏర్పాటు చేశారు. ఎవరూ ఇళ్లల్లో నుంచి బయటకు రావద్దంటూ హెచ్చరికలు చేశారు. మరోవైపు మృతుడు నాగమల్లేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లు తమ బంధువులను రానివ్వాలని వేడుకున్నప్పటికీ పట్టించుకోలేదు. ఆధార్ కార్డులు చూపాలంటూ అనేక రకాల ఆంక్షలు పెట్టి పోలీసులు ఇబ్బందులకు గురి చేశారు. అయినప్పటికీ లెక్కచేయని జనం తమ అభిమానాన్ని చాటుకునేందుకు ఇళ్ల పైకి ఎక్కి జగన్‌మోహన్‌రెడ్డిని చూసి చేతులు ఊపుతూ స్వాగతం పలికారు. వారి అభిమానానికి ముగ్ధుడైన వైఎస్ జగన్ చిరునవ్వుతో అభివాదం చేశారు. వైఎస్ జగన్ కాన్వాయ్ రెంటపాళ్ల గ్రామానికి చేరుకోగానే పోలీసులు నాలుగు డ్రోన్‌లు ఎగురవేశారు.

### కదం తొక్కిన నేతలు, కార్యకర్తలు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వ అరాచకాలకు బలైపోయిన కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లిరూరల్‌లో పర్యటించగా, తమ అధినేత జగనన్నపై అభిమానంతో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు భారీ సంఖ్యలో కంటేపూడి, నందిగామ అడ్డరోడ్డు, రామకృష్ణాపురం, సత్తెనపల్లి టౌన్, పాకాల పాడు, రెంటపాళ్లకు తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో ముందుగా పట్టణంలో ద్విచక్ర వాహనాలతో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గోర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రులు విడదల రజని, పేర్ని నాని, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్ రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, తలారి వెంకట్రావు, అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, దేవినేని అవినాష్, అంబటి మురళి, నేతలు పూనూరి గౌతమ్‌రెడ్డి, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, నాయకులు చిట్టా విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, పక్కాల సూరిబాబు, పెండెం బాబురావు, చల్లంచర్ల సాంబశివరావు, షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, రాయపాటి పురుషోత్తమరావు, కళ్లం విజయ భాస్కర్ రెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, అచ్యుత శివప్రసాద్, షేక్ మౌలాలి, షేక్ జలీల్, చిలుక జైపాల్, పల్లె గాబ్రియల్, ఏకుల మనీషా, ఏకుల పెద్ద ముత్తయ్య, కొమ్మెర శివ శంకర్, అబ్బూరి వీరాంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్‌లో జనసందోహం

## పేరేచర్ల జంక్షన్‌లో పోటెత్తిన జనం



పేరేచర్ల జంక్షన్‌లో వైఎస్ జగన్‌కు వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతున్న నేతలు, కార్యకర్తలు

**తాడికొండ:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు బుధవారం తాడికొండ నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు బ్రహ్మరథం పట్టాయి. అభిమాన నేతకు పేరేచర్ల జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్ జగన్ రాక నేపథ్యంలో పెద్ద ఎత్తున నాయకులు,కార్యకర్తలు అక్కడికి చేరుకొని సందడి చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలకు అక్కడకు చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కారు నుంచి బయటకు వచ్చి వారికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. యువకులు నినాదాలు చేస్తుండగా జనం కేరింతల నడుమ కాన్వాయ్ ముందుకు కదిలింది. అనంతరం మేడికొండూరు చేరుకున్న కాన్వాయ్‌కు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నాయకులను పలకరించిన వైఎస్ జగన్ ముందుకు సాగారు. జంగంగుంట్లపాలెం, పాలడుగు అడ్డరోడ్డు, కొర్రపాడు మీదుగా సత్తెనపల్లి నియోజకవర్గంలోకి అడుగు పెట్టారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ళ మనోహర్, మైనేని నాగమల్లేశ్వరరావు, తాళ్ళూరి వంశీకృష్ణ, మార్పుల శివరామిరెడ్డి, ఎంపీపీ మన్నవ స్వప్న, జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, దాసరి కత్తిరేణమ్మ, రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్, చిట్టా అంజిరెడ్డి , పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జననేతపై ఉప్పొంగిన అభిమానం



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికేందుకు ప్రాతూరు అండర్‌పాస్ వద్ద వేచి చూస్తున్న వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు

**తాడేపల్లి రూరల్:** రెంటపాళ్లకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దారిపొడవునా ఘన స్వాగతం లభించింది. తాడేపల్లి క్రిస్టియన్‌పేటలో మహిళలు బయటకు వచ్చి స్వాగతం పలకడంతో వైఎస్ జగన్ కారు దిగి అభివాదం చేశారు. 16వ నెంబర్ జాతీయ రహదారి వెంబడి ప్రాతూరు కుంచనపల్లి అండర్‌పాస్ వద్ద వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు మేకా వెంకట రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి రూరల్ కన్వీనర్ అమరా నాగయ్య, మంగళగిరి రూరల్ పార్టీ అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, వివిధ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, పాల్గొన్నారు. వైఎస్ జగన్ కారు దిగి కరచాలనం చేశారు. అనంతరం మంగళగిరి నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులు పులగం సందీప్‌రెడ్డి కాన్వాయ్ వెంట ర్యాలీ నిర్వహించారు. టోల్‌గేటు వద్దకు చేరిన వైఎస్ జగన్ కాన్వాయ్‌కు స్థానిక నేతలు స్వాగతం పలికారు. తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, నియోజకవర్గ జేసీఎస్ మాజీ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, నాయకులు చిలకా మధు, కళ్ళం పిచ్చిరెడ్డి, ఉండ్రు కళ్యాణ్, మిరియాల రాంబాబు, గొడవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పెదకాకానిలో జయహో... జగన్



పెదకాకాని వై జంక్షన్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

**పెదకాకాని:** జై జగన్.. జైజై జగన్, జయహో.. జగన్ నినాదాలతో పెదకాకాని వై జంక్షన్ మార్మోగింది. అభిమాన నాయకుడిని చూసేందుకు బుధవారం పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు అభిమానులు చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్‌కు పార్టీ జెండాలు, చిత్రపటాలతో ఘన స్వాగతం పలికారు. ఉదయం 10 గంటలకు పెదకాకాని వై జంక్షన్‌కు చేరుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అంబటి మురళీకృష్ణ పూల బొకేతో స్వాగతించారు. అభిమాన నాయకుడిని కలిసేందుకు ఒక్కసారిగా వందల సంఖ్యలో పార్టీ శ్రేణులు కాన్వాయ్ వైపు దూసుకుపోయారు. కారు నుంచి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బయటకు వచ్చి అభివాదం చేశారు. పెదకాకాని వై జంక్షన్, ఆటోనగర్ బైపాస్‌రోడ్డు అభిమానులతో కిక్కిరిసింది. వారి నినాదాలతో దద్దరిల్లింది. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, సర్పంచ్ పిట్టు శివకృష్ణారెడ్డి, జిల్లా యాక్టివిటీవ్ కార్యదర్శి వుయ్యూరు సతీష్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, ఆలపాటి రాఘవ, ముడియాల మల్లికార్జునరెడ్డి, కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, సఫారీ బాబు, పొందుగుల కమల్, దంతాల శ్రీనివాసరావు, బద్దెపూడి రమేష్, కూచిపూడి మధు తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్డీఏ జాబ్‌మేళాలో 110 మంది ఎంపిక



ఇంటర్వ్యూ చేస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

**తాడికొండ:** ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సహకారంతో తుళ్ళూరు సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో బుధవారం జాబ్ మేళా జరిగింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆటోమొబైల్, ఫైనాన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాలకు చెందిన కంపెనీలైన వరుణ్ మోటార్స్, స్కిల్ క్రాఫ్ట్ లిమిటెడ్, ఎంవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు లిమిటెడ్, కేఎంవీ ప్రాజెక్ట్ లిమిటెడ్, శ్రీ రామ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. మొత్తం 806 మంది దరఖాస్తు చేసుకోగా 264 మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూ తర్వాత 110 మందికి ఆఫర్ లెటర్లు అందించారు. 137 మంది అభ్యర్థులను తదుపరి రౌండ్లకు ఎంపిక చేశారు. రాజధాని అమరావతిలో పర్యటిస్తున్న ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధుల బృందం ఈ జాబ్ మేళాను పరిశీలించింది. అభ్యర్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుంది. సమన్వయ అధికారులుగా ఏపీ ఎస్ఎస్‌డీసీ నైపుణ్య శిక్షణాధికారి సాయి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి, ఎస్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ వి.నరసింహారావు, సీఆర్డీఏ డీసీడీవో బి. శ్రీనివాసరావు, సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.







## పంపకాల్లో తేడాతో టెండర్లు వాయిదా

**నెహ్రూనగర్:** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన అభివృద్ధి పనులకు ఈ నెల 18వ తేదీన టెండర్లు ప్రక్రియ జరగాల్సి ఉండగా ఇంజినీరింగ్ అధికారులు ఈ నెల 21వ తేదీకి వాయిదా వేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక టెండర్లన్నీ ఆయా కూటమి పార్టీలకి చెందిన కాంట్రాక్టర్లు మాత్రమే ఎక్కువ లాభాలు వచ్చేలా వేయాలని.. తక్కువ లాభాలు వచ్చే టెండర్లు మాత్రమే వేరే కాంట్రాక్టర్లు వేసుకోవాలని కొద్ది రోజులుగా కాంట్రాక్టర్ల సమావేశంలో హుకుం జారీ చేసిన విషయం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. టెండర్ల విషయంలో తాము అనుకునే కాంట్రాక్టర్ కాకుండా వేరే వాళ్లు పోటీ పడనున్నారనే సమాచారంతో కొంత మంది కూటమి పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు వెంటనే రంగంలోకి దిగారు. ఇంజినీరింగ్ అధికారులను అడ్డం పెట్టుకుని బుధవారం 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన టెండర్లలో సుమారు రూ.30 కోట్ల మేరకు 15 పనులను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసేలా చేశారు. దీనిపై ఇంజినీరింగ్ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా.. కొన్ని టెండర్లకు ఎవరూ దాఖలు చేయకపోవడం కారణంగానే వాయిదా వేశామని చెప్పారు.

## పోలీసుల పనితీరుపై అసహనం



విచారణ నిర్వహిస్తున్న అర్చనా మజుందార్

**గుంటూరు ఎడ్యుకేషన్:** పోలీసుల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనా మజుందార్ అసహనం వ్యక్తం చేశారు. కేసుల దర్యాప్తు ఆలస్యం అవుతోందని, నిందితులను అరెస్ట్ చేయకపోవడంతోపాటు సరైన సెక్షన్లు నమోదు చేయటం లేదని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. వాటిపై విచారణ జరిపి, కమిషన్‌కు గల జ్యుడీషియల్ అధికారాలను ఉపయోగించుకుని సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకునేలా పోలీసు శాఖను ఆదేశిస్తామని చెప్పారు. బుధవారం గుంటూరు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మహిళా జన్ సున్వాయ్' కార్యక్రమంలో వివిధ సంఘటనలపై జాతీయ మహిళా కమిషన్‌కు అందించిన ఫిర్యాదులపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజతో కలిసి ఆమె విచారణ చేపట్టారు. తూర్పుగోదావరి, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాలకు సంబంధించి ఫిర్యాదులపై విచారణ జరిపారు. జెడ్పీకి వచ్చిన అర్చనా మజుందార్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పుష్పగుచ్ఛం అందించారు.

### జిల్లా జైలు సందర్శన

**నగరంపాలెం:** గుంటూరు జిల్లా జైలును బుధవారం డాక్టర్ అర్చనా మజుందార్, రాయపాటి శైలజలు బుధవారం సందర్శించారు. మహిళా ఖైదీల నివాస విభాగం, వంటశాల, రేషన్ గోదాం, ఖైదీలకు ఇచ్చే ఆహార పదార్థాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు.

### మహిళల రక్షణకు ప్రాధాన్యత

**గుంటూరు వెస్ట్:** మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనా మజుందార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ ఎ.భార్గవ్‌తేజ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెల్ప్‌లైన్, మెయిల్ ద్వారా ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

## పోలీసులకు, అంబటికి మధ్య వాగ్వాదం

- జగన్ కాన్వాయ్ నిలిపేందుకు బారికేడ్లు ఏర్పాటు
- పోలీసుల తీరుపై వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి ఆగ్రహం



బారికేడ్లు తొలగిస్తున్న అంబటి రాంబాబు

**మేడికొండూరు:** కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. కూటమి అరాచక పాలనలో ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు బుధవారం జననేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి తాడేపల్లి నుంచి తన కాన్వాయ్‌తో బయలుదేరారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా జగనన్నకు జేజేలు కొడుతూ అభిమానాన్ని చాటారు.

### ప్రణాళిక ప్రకారమే...

జగనన్నకు ప్రజా ఆదరణ ఇంకెంత లభిస్తుందో అని కూటమి నేతలు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. జగన్ తన కాన్వాయ్‌లో సత్తెనపల్లి పట్టణ శివారులో చేరుకునేటప్పటికీ కూటమి నేతలు జగనన్న తలపెట్టిన కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పథకం రచించారు. ఎలాగైనా వైఎస్ జగన్ కాన్వాయ్‌కు పోలీసుల సహకారంతో బారికేడ్లు అడ్డుగా పెట్టి ఆపేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ విషయం గ్రహించిన వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు బారికేడ్లను అడ్డు తీసివేయాలని పోలీసులకు సూచించారు. దీంతో పోలీసులకు, అంబటి రాంబాబు మధ్య వాగ్వాదం జరిగింది. జగన్ కాన్వాయ్ ఆపే శక్తి ఎవరికీ లేదంటూ అంబటి రాంబాబు భావోద్వేగానికి లోనయ్యారు. జన సందోహం ఎక్కువగా ఉండటంతో బారికేడ్లను తీసివేయించారు. పోలీసులు కూడా చేసేదేమీ లేక బారికేడ్లను తొలగించి, వారిని ముందుకు పోనిచ్చారు. ఇలా అడ్డుకోవడం కేవలం జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి కూటమి నేతలు చేస్తున్న వికృత చేష్టగా అంబటి మండిపడ్డారు. రౌడీ రాజ్యంగా మారుస్తున్నారని అక్కడ ఉన్న పోలీసులను దుయ్యబట్టారు.

## అర్ధరాత్రి వరకు నర్సుల బదిలీల కౌన్సెలింగ్

**గుంటూరు మెడికల్:** గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో మంగళవారం జరిగిన స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సుల సాధారణ బదిలీల కౌన్సెలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. కౌన్సెలింగ్ నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని జూమ్ కౌన్సెలింగ్ ద్వారా సాధారణ బదిలీలు పొందిన కొంత మంది నర్సింగ్ సిబ్బంది ఆర్డీ కార్యాలయానికి వెళ్లి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరిలో పనిచేస్తున్న వారిని, గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న వారిని ఒకే యూనిట్‌లా చేసి ఎలాంటి మినహాయింపులు ఇవ్వకపోవటంతో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. స్పౌజ్ సర్టిఫికెట్లు, మెడికల్ సర్టిఫికెట్ల మినహాయింపుల్లో కూడా పలు అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ రెండుసార్లు జూమ్ కౌన్సెలింగ్ జరుగుతున్న సమయంలో ఆయా ఆర్డీ కార్యాలయాల స్పెషల్ ఆఫీసర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా హంస యూనియన్‌కు మినహాయింపు ఇవ్వాలనే విషయంపై కోర్టుకు వెళ్లటంతో స్టే వచ్చినట్లు యూనియన్ నేతలు తెలిపారు. ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల పలువురు నష్టపోయారని, కోర్టు ఉత్తర్వుల ప్రకారం నర్సుల కౌన్సెలింగ్ రద్దు చేసి, తిరిగి బుధవారం నిర్వహించాలని హంస యూనియన్ నేతలు కోరుతున్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సాగిందిలా...

**సాక్షి ప్రతినిధి, గుంటూరు:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెంటపాళ్ల పర్యటన ఆద్యంతం పార్టీ శ్రేణుల నడుమ సాగింది. తాడేపల్లిలోని నివాసం నుంచి ఉదయం 9.40 గంటలకు ఆయన బయలుదేరారు. మంగళగిరి ఫ్లై ఓవర్ వద్దకు 9.55 గంటలకు కాన్వాయ్ చేరుకుంది. అక్కడి నుంచి కాజ టోల్ ప్లాజా నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్దకు 10 గంటలకు చేరుకున్నారు. తర్వాత గుంటూరు వై జంక్షన్ వద్దకు ఉదయం 10.15 గంటలకు వచ్చారు. అక్కడ అభిమానులను అభివాదం చేసుకుంటూ ఏటుకూరు బైపాస్‌కు ఉదయం 11.18 గంటలకు చేరుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, అభిమానులతో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి గుంటూరు చుట్టుగుంట సెంటర్‌కు 11.29 గంటలకు చేరుకున్నారు. కార్యకర్తలు, అభిమానులు వైఎస్ జగన్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. గుంటూరు కృష్ణబాబు కాలనీకి 11.30 గంటలకు మాజీ సీఎం చేరుకున్నారు. అక్కడ అభిమానులను అభివాదం చేస్తున్న సమయంలో చిన్నారి జ్ఞానావత్ మధులిక బాయిని పరామర్శించారు. హౌసింగ్ బోర్డుకు ఉదయం 11.45 చేరుకున్నారు. నల్లపాడుకు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చారు. పేరేచర్ల జంక్షన్‌కు చేరేసరికి మధ్యాహ్నం 12.30 గంటల సమయం అయింది. మేడికొండూరుకు మధ్యాహ్నం 12.45 గంటలకు చేరారు. కంటిపూడి మధ్యాహ్నం 1.45 గంటలకు, నందిగామ అడ్డరోడ్డుకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకున్నారు. సత్తెనపల్లి ఆటోనగర్ వచ్చేసరికి మధ్యాహ్నం 2.40 గంటలైంది. సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు మధ్యాహ్నం 2.45 గంటలకు చేరుకున్నారు. సత్తెనపల్లిలోని ఐదు లాంతర్ల సెంటర్‌కు మధ్యాహ్నం 3 గంటలకు వచ్చారు. సత్తెనపల్లి రైల్వే గేటు ప్రాంతానికి మధ్యాహ్నం 3.35 గంటలకు చేరుకున్నారు. అచ్చంపేట రోడ్డు వద్దకు వచ్చేసరికి మధ్యాహ్నం 3.47 గంటలు, తర్వాత రెంటపాళ్ల గ్రామానికి చేరుకునే సరికి సాయంత్రం 5 గంటలైంది.

## యోగాంధ్రపై అవగాహన



విజేతలను సత్కరించి బహుమతులు అందిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

**అమరావతి:** స్థానిక ధ్యానబుద్ధ విగ్రహం ఎదురుగా ఉన్న బుద్ధవనం ప్రాంగణంలో బుధవారం జిల్లా స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొని యోగా పోటీలలో విజేతలను సత్కరించి, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంతరెడ్డి, ఎంపీపీ మేకల హనుమంతరావు, తహసీల్దార్ డానియేల్, ఎంపీడీవో పార్వతి తదితర అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు సాధన చేశారు.

## యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న ఆచార్య కె. మధుమూర్తి, ఆచార్య కె. గంగాధరరావు తదితరులు

**ఏఎన్‌యూ:** యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తి అన్నారు. యోగాంధ్రలో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన యోగా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యోగా ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించి దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ యోగా ఆవశ్యకతను తెలియజేస్తూ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అకడమిక్ అడ్వైజర్ ఆచార్య జి.రోశయ్య, వర్సిటీ పాలకమండలి సభ్యులు ఆచార్య సుమంత్ కుమార్, ఆచార్య జగదీష్ నాయక్, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం యోగా ఆవశ్యకతను తెలిపారు. ప్రిన్సిపల్ ఆచార్య వీరయ్య, ఆచార్య సురేష్ కుమార్, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, యోగాంధ్ర నిర్వాహకులు ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, రూసా డైరెక్టర్ ఆచార్య ఎస్.మురళీమోహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్య తేజోమూర్తి, సీడీసీ డీన్ ఆచార్య రవికుమార్, పీజీ, యూజీ పరీక్షల కోఆర్డినేటర్లు ఆచార్య సుబ్బారావు, ఆచార్య ఎన్వీ కృష్ణారావు, వర్సిటీ వసతి గృహాల చీఫ్ వార్డెన్లు ఆచార్య మల్లికార్జున్, డాక్టర్ మాధవి, ఆచార్య త్రిమూర్తి రావు, ఆచార్య బ్రహ్మాజీ, ఆచార్య సుధాకర్, డాక్టర్ చంద్రమౌళి, గుంటూరు జిల్లా పరిధిలోని పలు కళాశాలల నుంచి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



